

నెరవేరని రెవెన్యూ వసూళ్ల లక్ష్యం

సిబ్బంది లోటు.. పర్యవేక్షణ లోపంతో కార్పొరేషన్‌కు పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరడం లేదు. 2023-24లో ప్రైవేటు బిల్డింగ్‌లు, సూట్స్‌కు సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్ రూ.26.81 కోట్లకుగానూ రూ.12.20కోట్లు మాత్రమే వసూలు చేశారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి పన్నుల వసూళ్లలో మరింత నిర్లక్ష్యం కనిపించింది. రూ.7.9 కోట్లకుగానూ రూ.47.96 లక్షలు వసూలు చేశారు. ప్రైవేటు ఖాళీ స్థలాలకు సంబంధించి.. రూ.5.25 కోట్లకుగానూ రూ.2.16కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక నీటి సరఫరా చార్జీ కింద రూ.4. 52కోట్లకుగానూ రూ.1.12 కోట్లు వసూలైంది. మ్యుటేషన్ విషయంలో నూటికి నూరుశాతం లక్ష్యం చేరుకున్నారు. మున్సిపల్ దుకాణాల అద్దె కూడా పూర్తిగా వసూలు చేయలేకపోయారు. 436 దుకాణాలకు గాను ఏడాదికి రూ.4.9 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.2.94కోట్లు వసూలు చేశారు. పర్యవేక్షణ లేక.. కిందిస్థాయి సిబ్బంది దుకాణదారులతో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ 23.15 శాతం రెవెన్యూ వసూళ్లు చేశారు.



ఖాళీల నగరం

- కీలక అధికారులు, కిందిస్థాయి సిబ్బంది కొరత
- అభివృద్ధి పనులకు ఆటంకం
- గత ఐదేళ్లూ మరీ అధ్వానం
- ఇదీ శ్రీకాకుళం నగరపాలక సంస్థ తీరు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ తయారైంది. ఎనిమిదేళ్ల కిందట మునిసిపాలిటీగా ఉన్న శ్రీకాకుళం.. టీడీపీ హయాంలో కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. నగరపాలక సంస్థలో చెప్పుకోదగ్గ కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేక పోయింది. గత ఐదేళ్లూ.. అభివృద్ధి శూన్యం. ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్.. ప్రత్యేక సమీక్ష నిర్వహించగా శ్రీకాకుళం కార్పొరేషన్ డొల్లతనం బయటపడింది. ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉండగా.. సిబ్బంది కొరత కూడా వేధిస్తుండడంతో.. ప్రగతి తప్పిందని తేటతెల్లమైంది.

● ప్రజలకు సేవలందించి.. శ్రీకాకుళం కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళ్లాల్సిన అధికారిక పోస్టులన్నీ చాన్నాళ్ల నుంచి ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం 'సుడా' (శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న చల్లా ఓబులేసు.. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. అసిస్టెంట్ కమిషనర్, మేనేజర్, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ (గ్రేడ్-3) పోస్టులు ఖాళీ. ఇక కీలకమైన రెవెన్యూ అధికారి పోస్టు ఖాళీ. కీలక సేవలన్నీ ఆరుగురు సీనియర్ అసిస్టెంట్‌లు, 17మంది జూనియర్ అసిస్టెంట్లు అన్నీతామై వ్యవహరిస్తున్నారు.

● ఇంజనీరింగ్ విభాగంలో.. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ముగ్గురు ఉండాలి. కానీ ఒక్కరే ఉన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లు ఆరుగురికిగానూ ఇద్దరే ఉన్నారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఇద్దరితోపాటు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీయర్ మూడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

● ప్రజా ఆరోగ్య విభాగంలో.. మునిసిపల్ హెల్త్ అధికారి ఉన్నారు. కానీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు నాలుగూ ఖాళీగానే ఉన్నాయి. రెండు హెల్త్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీయే. ప్రజారోగ్యం మేస్త్రీ విభాగంలో 12 మందికిగానూ ఆరుగురే ఉన్నారు. పబ్లిక్ హెల్త్‌వర్కర్‌లు 187 మందికిగానూ 73 మంది ఉన్నారు. దీనిని బట్టి నగరంలో ప్రజారోగ్యం పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతోంది. అకౌంట్స్ అండ్ ఆడిట్ సెక్షన్‌లో జూనియర్ అకౌంటెంట్ పోస్టులు మూడు ఖాళీగానే ఉన్నాయి.

● ఆదాయ.. వ్యయ వివరాలు

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ప్రాపర్టీ ట్యాక్స్ ద్వారా రూ.2,264.69 లక్షలు, వీఎల్టీ రూ.85.75 లక్షలు, ప్రకటనల ద్వారా రూ.25.09 లక్షలు.. మొత్తం రూ.2,375.53 లక్షలు చేకూరింది. నాన్‌ట్యాక్సెస్ కింద (వాటర్ చార్జెస్, మార్కెట్ ఫీజు, టౌన్ ప్లానింగ్ రిక్, మ్యుటేషన్ ఫీజు, ట్రేడ్ లైసెన్స్) ఇలా ఇతరత్రా విభాగాలకు సంబంధించి రూ.1,446.45 లక్షలు సమకూరింది. మొత్తంగా రూ.4071.95 లక్షల ఆదాయం లభించగా.. ఇందులో రెవెన్యూ ఖర్చు రూ.2,646.51 లక్షలు పెట్టారు. ప్రస్తుతం బ్యాలెన్స్ రూ. 1425.44 లక్షలు మిగిలింది. అప్పుడప్పుడూ సమీక్షలు నిర్వహిస్తున్నా.. మొక్కుబడిగానే సాగుతున్నాయి.

● ఎన్నికలు ఎప్పుడో?

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిగి రెండు దశాబ్దాలు కావస్తోంది. కొన్నాళ్ల కిందట శ్రీకాకుళం నగరానికి ఆనుకుని ఉన్న ఏడు పంచాయతీలను విలీనం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ.. ఆయా పంచాయతీలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో ఎన్నికలు జరగడం లేదు. వాస్తవంగా ఎన్నికలు జరిగితే.. నగరపాలక సంస్థకు మేయర్, యాభై మంది కార్పొరేటర్లు ఉంటారు. నగరంలో వారిదే హవా. అప్పుడు ఎమ్మెల్యే దర్పం పోతుంది. మేయర్ తర్వాతనే నగరంలో ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ కారణంతో ఇదిగో.. అదిగో.. ఎన్నికలు అంటున్నారు తప్ప.. నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఇలా ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా.. ఎన్నికలు జరగడం లేదు. ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పైగా ఇప్పుడు విలీన పంచాయతీల్లో ఎచ్చెర్లకు చెందిన పంచాయతీలను తొలగించి శ్రీకాకుళం మండలం రాగోలును కూడా విలీనం చేయాలన్నది తాజా ప్రతిపాదన. దీంతో ఈ పంచాయతీ నుంచి ఎవరైనా వ్యతిరేకించి కోర్టును ఆశ్రయిస్తే.. మళ్లీ ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్పందించి.. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని, నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న జూడాల సమ్మె

అరసవల్లి, ఆగస్టు 19: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) వద్ద జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె సోమవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జూడాల జిల్లా అధ్యక్షుడు గురువెల్లి వెంకటేష్ మాట్లాడుతూ.. వైద్యుల రక్షణకు సత్వరమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, విచారణను త్వరగా చేసి దోషులను కఠినంగా శిక్షించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో స్త్రీలను సోదరిగా చూడాలని చెబుతూ రాఖీ పండగ సందర్భంగా వారు రాఖీలను కట్టించుకున్నారు.


రిమ్స్ కళాశాల ఎదుట జూనియర్ వైద్యుల నిరసన

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సహకారం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- ముగిసిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 19: 'క్రీడాకారులను మరింత ప్రోత్సహించేలా జిల్లాలో అన్ని క్రీడాంశాల్లోనూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలి. అందుకు తగ్గ సహకారం అందిస్తామ'ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడురోజుల నుంచి జరుగుతున్న 11వ అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంటు సోమవారం ముగిసింది. విజేతలను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అభినందిస్తూ.. ట్రోఫీ కప్‌లను అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'క్రీడలతో జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏ క్రీడంశాల్లోనైనా జిల్లావాసులు ఇట్టే రాణించగలరు. ఆరోగ్యకరమైన వాతావరణానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. 20 28లో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తాం. క్రీడాకారులకు రైల్వే శాఖ ఇచ్చిన 75శాతం రాయితీ.. పునరుద్ధరణకు కృషి చేస్తా'నని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి సాంబమూర్తి, ముఖ్య సలహాదారు సుందరరావు, ఎస్జీఎ ఫ్ కార్యదర్శి బీవీ.రమణ, సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి. రమణ, కలిదిండి వెంకటరమణ పాల్గొన్నారు.

● విజేతలు వీరే

అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంటులో బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ, శ్రీకాకుళం జట్టు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ, గుంటూరు జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.


శ్రీకాకుళం బాలుర రన్నరప్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

మద్యం విక్రయాల్లో గోల్‌మాల్!



సంవత్సరం	విక్రయాలు
2019-20	రూ.1,027 కోట్లు
2020-21	రూ.1,080 కోట్లు
2021-22	రూ.1,345 కోట్లు
2022-23	రూ.1,421 కోట్లు
2023-24	రూ.1,510 కోట్లు
మొత్తం	రూ.6,383 కోట్లు

- వైసీపీ హయాంలో మద్యంలో భారీ అవినీతి
- త్వరలో విచారణకు సన్నాహాలు
- అక్టోబరు 1 నుంచి నూతన పాలసీ

(రణస్థలం)

నూతన మద్యం పాలసీ విధానం అమలుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మద్యం పాలసీ సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ భేటీ జరిగింది. అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ విధానం అమలు చేసేలా ఆమోదముద్ర వేసింది. అదే సమయంలో గత వైసీపీ హయాంలో మద్యం పాలసీలో అవకతవకలపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. వైసీపీ పాలనలో రాష్ట్రంలో మద్యం ద్వారా రూ.30వేల కోట్లు పక్కదారి పట్టినట్టు ఆరోపణలున్నాయి. గత ఐదేళ్లలో జిల్లాలో రూ.6,383 కోట్ల మద్యం విక్రయాలు సాగగా.. రూ.300 కోట్ల వరకూ గోల్‌మాల్ జరిగినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం సరఫరా, పంపిణీ, షాపుల అద్దెలు, ఇలా ప్రతి అంశంలోనూ అవినీతి జరిగినట్టు ఆరోపణలున్నాయి. వీటిపై కూటమి ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయనున్నట్టు తెలుస్తోంది.

● షాపులను పెంచేశారు

2019లో సార్వత్రిక ఎన్నికల సమయానికి జిల్లాలో ఉన్న ప్రైవేటు మద్యం దుకాణాల సంఖ్య 235. టెండరు ప్రక్రియ ద్వారా లైసెన్స్ ఇచ్చి మద్యం షాపులకు అనుమతిచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపేందుకు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 178 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యనిషేధం హామీ అమల్లో భాగంగా.. ఏటా 25శాతం దుకాణాలను తగ్గిస్తామని అప్పటి సీఎం జగన్ చెప్పారు. ఈ లెక్కన 44 షాపులు తగ్గాలి. కానీ ఇప్పుడు ఉన్నవి అక్షరాలా 193 షాపులు. ఉన్న షాపులను తగ్గించకపోగా.. కొత్తగా టూరిజం ఔట్‌లెట్ల పేరుతో మరికొన్నింటిని ఏర్పాటు చేశారు. ఇక బార్లు 18వరకూ కొనసాగుతున్నాయి.

ఆరోపణలెన్నో..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. వీరి నియామకం విషయంలో అప్పటి అధికార వైసీపీ నేతలకు కాసులు ముట్టాయన్న ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ ఉన్నతాధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి రూ.30వేల నుంచి రూ.50వేల వరకూ పోస్టులు అమ్ముకున్నట్టు బాధితులే ఆరోపించారు. ఇటీవల బదిలీల్లో కూడా భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపించాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర కథనం ప్రచురించడంతో అవినీతి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. షాపుల అద్దెల విషయంలో సైతం వైసీపీ నేతలు భారీగా సొమ్ము వెనుకేసుకున్నారు. ప్రతీ దుకాణం నుంచి అధికారులు కార్యాలయాల నిర్వహణ పేరుతో రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసినట్టు తెలుస్తోంది. గ్రామాల్లో బెల్టులకు సరుకు పక్కదారి పట్టించడం, నకిలీ మద్యం విక్రయించడం వంటి వాటి విషయంలో కొందరు అధికారులు సిబ్బందిని సైతం తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో కోటబొమ్మాళి ప్రభుత్వ మద్యం దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలో ఏకంగా 1000 వరకూ కల్తీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి.

● వారే సూత్రదారులు

వైసీపీ హయాంలో అక్రమ మద్యం, సారా గురించి చెప్పనవసరం లేదు. పొరుగు జిల్లాల మద్యాన్ని కూడా తెచ్చి చెలామణీ చేశారు. ఇందులో అప్పటి అధికార పార్టీ నేతలే సూత్రదారులు అన్న ఆరోపణలు వినిపించాయి. పట్టణాల్లో సైతం సారా ప్రవాహం అధికమైంది. 2022 జనవరి 26న కవిటి మండలం కొత్తపాలెం తీరంలో పడవలపై తెస్తున్న 6000 సారా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలోని సువగాం నుంచి సముద్ర మార్గంలో బోట్లపై తెస్తుండగా.. ముందస్తు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పోలీస్ శాఖ సాయంతో పట్టుకున్నారు. రోడ్డు మార్గంలో నిఘా ఉండడంతో అక్రమార్కులు రూటు మార్చారు. 2022 డిసెంబరు 3న రణస్థలం మండలం దన్నానపేట జాతీయ రహదారిపై 3వేల మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణా లేబుళ్లతో ఒడిశా నుంచి విజయనగరం వ్యాన్‌లో తరలిస్తుండగా ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదంతా నకిలీ మద్యంగా తేలింది. కానీ ఎందుకో ఆ కేసు వివరాలు తర్వాత బయటకు రాలేదు. మచ్చుకు ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇలా వైసీపీ హయాంలో సాగిన అక్రమాలు అన్నింటిపై త్వరలో విచారణ చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పకడ్బందీగా నూతన మద్యం పాలసీ అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

వినతులను వేగంగా పరిష్కరించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్ ఆగస్టు 19: ప్రజా ఫిర్యాదుల విభాగం(మీ కోసం)లో వచ్చే వినతులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 130 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ సుదర్శన దొర, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ రాంబాబు, ఉద్యానశాఖ అధికారి ఆర్‌వి. ప్రసాదరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రాఖీ పౌర్ణమి సందడి



సోదర, సోదరీ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు ఘనంగా సాగాయి. జిల్లాలో పాఠశాలలు, హాస్టళ్లు, వివిధ కార్యాలయాలు ఎక్కడ చూసినా సందడి కనిపించింది. ఇచ్ఛాపురం మండలం **ఇన్నేసుపేట ఎంపీపీఎస్ పాఠశాలలో** సోమవారం విద్యార్థులకు.. విద్యార్థినులు రాఖీలు కట్టి.. అభిమానాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వీట్లు తినిపించుకున్నారు. రక్షాబంధన్ విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు ఆర్.సూర్యనారాయణ వివరించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణ చుట్టూ మొక్కలు నాటారు. - ఇచ్ఛాపురం



జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలో వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎచ్చెర్ల మండలం **కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో** పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవీకి అలంకరించి విశేష పూజలు చేశారు. శ్రీ చక్రాల వద్ద అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలు చేశారు. - ఎచ్చెర్ల

దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉప.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బతీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.

బ్రహ్మా ఆనందం సందడి



హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

కూర్గ్‌లో పెళ్లి



'రాజావారు_రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో ఆలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.



'హ్యాపీ రక్షా బంధన్'

"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.



ఇష్టమైన సమయం వచ్చేసింది

"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



నిన్ను బాగా మిస్సవుతున్నాను

"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడయాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్ రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.

హీరో కృష్ణ అభిమాని సినిమా



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు


నరసన్నపేట/పోలాకి: ఎమ్మెల్యే రమణమూర్తికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

జిల్లా వ్యాప్తంగా శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. సోదర బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగలో భాగంగా పలు పాఠశాల విద్యార్థినులు అధికారులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా రాఖీ దుకాణాలు, స్వీట్ల షాపులు కిటకిటలాడాయి. -ఆంధ్రజ్యోతి



కేంద్రమంత్రికి రాఖీ కట్టిన సోదరి

శ్రీకాకుళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఆయన సోదరి రాజమండ్రి మాజీ ఎమ్మెల్యే భవానీ సోమవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ తన సోదరితో ఫొటో దిగి సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు.


పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రాఖీ కడుతున్న సోదరి


సరుబుజ్జిలి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు


టెక్కలి: సీఐ పైడయ్యకు రాఖీ కడుతున్న ఎస్టీ బాలికల వసతిగృహం విద్యార్థినులు


పొందూరు: ఏఎస్ఐకి రాఖీ కడుతున్న జూనియర్ కళాశాల, పాఠశాల విద్యార్థినులు

ఆత్మవిశ్వాసంతో సమస్యలను అధిగమించవచ్చు

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి


భవిత సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయాధికారి రోషిణి

పాతపట్నం: ఆత్మవిశ్వాసం, సంకల్ప బలంతో ప్రతి సమస్యను అధిగమించవచ్చని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయపరమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అవసరాలు, మానసిక అంగ వైకల్యం ఉన్న విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడుతూ.. అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.రమణ, ఎంఈవో తిరుమలరావు, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్సీ దువ్వాడ

● 12వ రోజుకు చేరిన వాణి న్యాయపోరాట దీక్ష

టెక్కలి: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ డ్రామా శుక్రవారం కోర్టుకు చేరింది. తన భార్య వాణి, కుమార్తె హైందవి తనపై దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దువ్వాడ హైకోర్టును ఆశ్రయించారు. తన నివాసం వద్ద రోజుల తరబడి ఆందోళన చేస్తున్నారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించడం లేదని అందులో పొందుపరిచారు. హైకోర్టును దువ్వాడ ఆశ్రయించడంతో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ విషయమై ఇప్పటికే టెక్కలి పోలీసులు పూర్తి వివరాలతో సోమవారం హైకోర్టుకు వెళ్లారు. ఇదిలా ఉండగా వాణి చేస్తున్న న్యాయపోరాట దీక్ష 12వ రోజు కొనసాగింది. తనకు ఆస్తులు అక్కర లేదని, పిల్లల భవిష్యత్ కోసం కలిసి ఉందామని వాణి చెబుతుండగా శ్రీనివాస్ బదులిస్తూ తనకున్న రూ.30 కోట్ల ఆస్తిలో రూ.27 కోట్లు వాణికి రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని, ఆమెతో మాత్రం కలిసి ఉండేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీని వాస్ కట్టిన ఇంటిలో తనకూ వాటా ఉందని, తాను రూ.2 కోట్లు ఇచ్చానని మాధురి చెబు తోంది. ఈ మేరకు సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆమె మాటల్లోనే.. 'శ్రీనివాస్ ఇల్లు కట్టడానికి రూ.2 కోట్లు ఇచ్చాను. ఆ డబ్బు కోసం నేను ఆశించడం లేదు. అదే ఇల్లు వాణికి కావాలంటే రూ.2 కోట్లు నాకివ్వాలి. అప్పుడే ఆమెను ఆ ఇంటికి వెళ్లనివ్వండి. లేదంటే నేను కూడా అక్కడకు వచ్చి కూర్చుంటా. నా వల్ల శ్రీనివాస్‌కు ప్రాణహాని ఉందని వాణి చెప్పడం కరెక్ట్ కాదు. రెండేళ్లుగా శ్రీనివాస్ ఆలనా, పాలనా నేనే చూశా. ఇన్నాళ్లు లేనిది ఇప్పుడు ఎందు కొచ్చింది. శ్రీనివాస్‌కు ఆమె త్రెట్ చేసింది. డోర్లు పగులగొట్టి లోపలకు వచ్చి ఆయనపై దాడికి దిగింది. వాణి వల్ల శ్రీనివాస్ కు ముప్పుంది' అని మాధురి పేర్కొన్నారు. తనకు శ్రీనివాస్ బకాయి ఉన్నాడని సంబంధిత చెక్కులను మీడియాకు మాధురి చూపించింది.

చెత్తసంపద కేంద్రాలతో సేంద్రియ ఎరువులు

వజ్రపుకొత్తూరు: చెత్తసంపద కేంద్రాలను సక్రమంగా వినియోగించడం ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించవచ్చని డీఎల్పీవో ఐవీరమణ అన్నారు. సోమవారం పెద్దబొడ్డపాడులోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ ఎరువులను కొనుగోలు చేయడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇళ్లనుంచి సేకరించే చెత్తను ఈ కేంద్రాలకు తరలించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోతే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందు వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వివాహానికి రూ.లక్ష సాయం


నగదు అందిస్తున్న భవాని, తల్లిదండ్రులు

హిరమండలం: హిర మండలం బ్రాహ్మణ వీధిలో నివాసముంటున్న మించుల నారాయణమ్మ చిన్న కుమార్తె వివాహానికి పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవానీ, రవి కుమార్ దంపతులు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. నారాయణమ్మ భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందగా ఇద్దరు కుమార్తెలను పెంచుతోంది. పెద్ద కుమార్తెకు వివాహం చేసింది. రెండో కుమార్తెకు ఇటీవల నిశ్చితార్థం అయింది. అయితే వివాహానికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన స్థానికులు కొంత సాయం చేశారు. ఈ నేపథ్యంలో నిరుపేద వివాహానికి భవాని, తల్లిదండ్రులు రూ.లక్ష నగదును అందించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

గోతులమయంగా పెద్దబాణాపురం రోడ్డు



నందిగాం: పెద్దబాణాపురం మెయిన్ వీధి రోడ్డు గోతులమయంగా తయారై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరి వాహన చోదకులు, పాదచారులు అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదా లకు గురికావాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి పక్కా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నైతిక విలువలు నేర్పేది సాంఘిక శాస్త్రమే

సంతబొమ్మాళి: విద్యార్థి దశ నుంచి పిల్లల్లో నైతిక విలువలు నేర్పేది సాంఘిక శాస్త్రమే అని బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.రామకృష్ణ అన్నారు. సోమవారం సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వ హించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నవ సమాజ నిర్మాత అని, విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని సూచించారు. కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో సముదాయ కార్యదర్శి బాడాన రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, తవిటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచుమాయి కాలనీలో వైద్యశిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

మందస: మందస కంచుమాయి కాలనీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 'కంచుమాయి కాలనీలో విషజ్వరాలు' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మందస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సంతోషిణి రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి బ్లీచింగ్ చల్లారు. దోమలు ఉత్పత్తి కాకుండా ఉండేందుకు ఫాగింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణం సీజ్


దుకాణాన్ని సీజ్ చేసిన అధికారులు

సంతబొమ్మాళి: బోరుభద్రలో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న పురుగు మందుల దుకా ణాన్ని సీజ్ చేసినట్లు టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ బీవీ తిరుమలరావు తెలిపారు. దుకాణంలో రూ. 31 వేల విలువైన పురుగు మందులను స్వాధీనం చేసుకుని దుకాణ యజమాని పంగ అప్పన్నపై సంతబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలో మండల ఇన్‌చార్జి ఏవో అప్పారావు, ఏఈవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గ పాస్టర్స్, లీడర్స్ కార్యవర్గం ఎన్నిక


పాస్టర్స్, లీడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ పాస్టర్స్, లీడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ సి.కృపానందం, రాష్ట్ర క్రైస్తవ సంఘ నాయకులు డీవీడీవీకుమార్ (బోస్‌బాబు) తెలిపారు. సోమవారం కాశీబుగ్గ తిలక్‌నగర్‌లో ఎరుషలేము ప్రార్థనా మందిరంలో సంఘ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా బిషప్ ఎస్.సుందర్ సింగ్, కార్యదర్శిగా సూరాడ యాకోబు, కోశాధికారిగా ఎస్.చిరంజీవులను ఎన్నుకున్నామన్నారు. అలాగే పలాస కాశీబుగ్గ టౌన్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులుగా కూను జోసెఫ్, సుందర్‌సింగ్, కోశాధికారిగా అమ్మాల కిరణ్‌కుమార్‌లను నియమించామన్నారు.

ఘనంగా సంతోషిమాతకు పూజలు

కాశీబుగ్గ/పలాస రూరల్: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రైల్వేగేటు సమీపంలో సంతోషిమాత అమ్మవారి తిరువీధి ఉత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగ అర్చకుడు మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సందర్భంగా గడచిన 50 ఏళ్లుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఈ సందర్భంగా రాత్రి భజన, భక్తిగీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. ● **ఎల్.ఎన్.పేట:** గార్లపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సంతోషిమాత ఆలయంలో సోమవారం రాఖీపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అర్చ కులు బంకుపల్లి రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యే పూజలు, రక్షాసూత్రధారణ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

'తెప్పల'కు తెలుగుభాషా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

పలాసరూరల్: పలాసకు చెందిన జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు తెప్పల కృష్ణమూర్తికి తెలుగు భాషా పురస్కారం లభించింది. కోనసీమ జిల్లా అమలాపురంలో అంబేద్కర్ సామాజిక భవనంలో సోమవారం సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం-138వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి రచించిన 'స్వర్గం కన్నా నా భారతం మిన్న' అన్న కవితా గానానికి ఈ అవార్డు వచ్చింది. దీనిని కళావేదిక చైర్మన్ డాక్టర్ కతిమతమండ ప్రతాప్, అధ్యక్షుడు ఈశ్వరీ భూషణ్, కొల్లి రమావతి అందించి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని పలు కళా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

సాంకేతిక లోపంతో వీసీకి అంతరాయం

నరసన్నపేట: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాంకేతిక లోపంతో మధ్యలోనే అంతరాయం కలిగింది. పంచాయతీరాజ్ విభాగానికి చెందిన వివిధ అధికారులతో పలు అంశాలపై సమీక్షిస్తున్న సమయంలో ఒక్కసారిగా అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్యను చక్కదిద్దేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలాకి ఎంపీడీవో కార్యాలయానికి పరుగులు తీశారు. కొద్ది రోజులుగా తహసీల్దార్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సిస్టం పనిచేయడం లేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలోనే వీసీకి హాజరవుతున్నారు.

శిరీష పరామర్శ

హరిపురం: హరిపురం గ్రామంలో కనగల పార్వతి ఇటీవల మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పోలాకి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. ఎంపీపీ ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు అధ్యక్షతన జరుగు సమావేశానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరవుతారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

కిక్కిరిసిన ఆర్టీసీ కాంప్లెక్స్

టెక్కలి: రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం ఉద యం నుంచి కిట కిటలాడింది. సుదూర ప్రాం తాలకు వెళ్లాల్సిన వారికి సకాలంలో బస్సులు రాక అవస్థలు పడ్డారు. రోజంతా ఆర్టీసీ కాంప్లె క్స్ రద్దీగా కనిపించింది.

ఉపాధ్యాయులు పని సర్దుబాటు విధుల బహిష్కరణ


ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


విధులు బహిష్కరించిన ఫ్యాప్టో ప్రతినిధులు

టెక్కలి: వర్క్ ఎడ్జస్ట్‌మెంట్‌ను నిరసిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ పిలుపు మేరకు సోమవారం పలువురు ఉపాధ్యాయులు పని సర్దుబాటు విధులను బహిష్కరించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు తులసీరావు, చిన్నవాడులకు వినతిపత్రం అందజేశారు. సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతుండగా వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ వాయిదా వేయాలన్నారు. మెరిట్ కం రోస్టర్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గణపతిరావు, తమ్మినాన వైకుంఠరావు, ఏపీటీఎఫ్ నాయకులు నేతాజీ, శ్రీనివాస్, ఆదినారాయణ, సురేష్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ● **హిరమండలం:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో జరగాల్సిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను బహిష్క రించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.శాంతారాం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న పని సర్దుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకుంటుంది

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు

నరసన్నపేట: వీడియో, ఫొటో గ్రాఫర్లకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ డాగురే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుల్లో ఫొటోగ్రఫీకి మంచి ఆదరణ ఉంటుందన్నారు. మంచి చిత్రాలు తీసిన ఫొటోగ్రాఫర్లకు గుర్తింపు ఉంటుందని, దీనిని ఎంతోమంది నిరూపించారన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, అసోసియేషన్ నాయకులు ప్రసాద్, నర్సింహమూర్తి, గోపి, గొండు కృష్ణ, జీవన్, పకీరురాజు, ధర్మారావు, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

పాతపట్నం: పాతపట్నంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నియోజకవర్గ ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు తూలుగు భుజంగరావు కెమెరా సృష్టి కర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ప్రజలు తన జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకునేందుకు ఫొటోగ్రఫీ దోహదం చేస్తుంద న్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పి.రాము, టి.వెంకటరావు, గోపికృష్ణ పట్నాయక్, ఎస్.రమణ, ఎస్.జోగారావు, బి.మధు, ఖగేష్, ఎ.యశ్వంత్ పాల్గొన్నారు.


డాగురే చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డేడీ చిన్మయిదేవి

జలుమూరు: అంగన్ కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో కేంద్రాలను తెరవాలని ఐసీడీఎస్ ఆర్డేడీ చిన్మయిదేవి అన్నారు. నగిరికటకం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమయానికి పౌష్టికాహారం అందించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. రికార్డులను ఎప్పటికకప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రేపు భారత్ బంద్


కొత్తూరు: సీఐకి వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నేతలు

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం బంద్ నిర్వహిస్తున్నట్టు దళిత మహాసభ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సహకరించాలని సీఐ ప్రసాదరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణను తక్షణం నిలుపుదల చేయాలని కోరారు. కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొత్తూరు మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు టొంపల తిరుపతి, కార్యదర్శి పడాల నాగభూషణం, కోశాధి కారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు కృష్ణ, వడమ శ్రీను, బాలకృష్ణ తదితరులున్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

టెక్కలి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా టెక్కలి నియోజకవర్గ జేఏసీ పిలుపు మేరకు బుధ వారం భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, రవాణా, వాణిజ్య, వర్తక, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు బంద్‌కు సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పాతపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి సంరక్షించాలని ఏపీ మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చెట్టుకు రాఖీని కట్టారు. అనంతరం మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో బోధనా బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పాతపట్నం: చెట్టుకు రాఖీ కడుతున్న వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జలుమూరు (సారవకోట): వెంకమ్మపేట గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఆయన తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆయన మృతిచెందినట్లు కేసు నమోదు చేశామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌గూడెం అంగన్వాడీ కార్యకర్త మృతి


స్వప్న(ఫైల్)

పొందూరు: తీవ్ర అనారోగ్యానికి గురైన వీఆర్‌గూడెం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త కె.స్వప్న (25) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఐదు నెలల గర్భవతి అయిన స్వప్న తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సోమవారం చేర్పించారు. శిశువు పెరుగుదలలో లోపం కారణంగా అబార్షన్ కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి స్వప్న మృతి చెందింది. స్వప్నకు భర్త అసిరినాయుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. స్వప్న మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

బుడితి కనకదుర్గ ఆలయంలో చోరీ

జలుమూరు (సారవకోట): బుడితి పుల్లేటి చెరువుగట్టుపై ఉన్న విజయ కనకదుర్గ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు అర్చకుడు సోమవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ అప్పారావు తెలిపారు. హుండీలోని నగదు, అమ్మవారి ఆభరణాలు చోరీ జరిగినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆలయంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడిపై కర్రలతో దాడి

ఎచ్చెర్ల: మండలంలో ఫరీద్‌పేట గ్రామంలో కూన ప్రసాద్ అనే యువకుడిపై కొంతమంది వ్యక్తులు ఆదివారం రాత్రి 11.15 గంటల సమయంలో కర్రలతో దాడి చేశారు. ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ప్రసాద్ తండ్రి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల నుంచి గ్రామంలో చిన్న చిన్న గొడవలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ పికెట్ కూడా కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

నలుగురు దొంగల అరెస్టు

- తొమ్మిది బైక్‌ల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఆమదాలవలస: జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ గొంప వాయునందన్‌దివాకర్ యాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పార్వతీశునిపేట జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మూడు బైక్‌లపై నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకున్నట్లు తెలిపారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా బైక్‌లు దొంగిలించి ఒడిశాలో విక్రయిస్తున్నట్లు చెప్పారు. వారి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆమదాలవలస పట్టణానికి చెందిన నలుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి: ఎస్పీ


శిక్షణ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం రూరల్: నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. తండ్యేంవలస గ్రామంలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ కేంద్రంలోని సిబ్బంది వివరాలు, వారి విధి విధానాలపై ఆరా తీశారు. తరగతి గదులు, బారెక్స్, మైదానం పరిశీలించి వాటిని శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నూతన చట్టాలు, ఇతరత్రా అంశాలపై శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులు, ప్రజలతో ఎలా ప్రవర్తించాలి, నీతి, నైతికత, శిక్షణలో నేర్చుకున్న చట్టాలు, వీటి అమలులో ఎదుర్కొంటున్న సమస్యలు, సైబర్ భద్రత తదితర అంశాలను ఎస్పీ వివరించారు. ఆయన వెంట ఎస్ఐ ఖాదర్ భాషా ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

శ్రీకాకుళం క్రైం: ప్రజా సమస్యలకు చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 46 వినతులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని సూచించారు.

విలేకరి మృతి కేసులో పురోగతి లేదు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన హ్యూమన్ రైట్స్ చైర్మన్

శ్రీకాకుళం క్రైం: లావేరు మండలానికి చెందిన ఓ పత్రిక విలేకరి గురిజా దామోదరరావు మృతి కేసులో ఎలాంటి పురోగతి లేదని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అండ్ స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కిందట దామోదరావు ఆత్మహత్య చేసుకున్నాడని, తన చావుకు అప్పటి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, లంకలపల్లి గోపి కారణమని ఆయన సూసైడ్ నోట్ రాసినప్పటికీ ఆ కేసులో ఎటువంటి పురోగతి లేదని తెలిపారు. రాజకీయ జోక్యంతో ఆ కేసును మూలపడేశారని ఆరోపించారు. దీనిపై గత నెల 3న విజయవాడ మంగళగిరిలో డీజీపీ ద్వారకా తిరుమలరావుకు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తక్షణం కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తాము పోరాటం సాగిస్తామని తెలిపారు.

పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు

కలెక్టరేట్: పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక అభివృద్ధితోనే జిల్లాలో ఆర్థిక ప్రగతి సాధ్యమని, అందుకోసం పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయండి

- కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనపై జిల్లాలో నిరసనలు
- న్యాయం చేయాలని డిమాండ్



అరసవల్లి: ప్రగతిశీల మహిళా సంఘ సభ్యుల నిరసన



గుజరాతీపేట: శ్రీకాకుళం నగరంలో..

ఇచ్ఛాపురం: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడడం అత్యంత దారుణమని, నిందితులను తక్షణమే ఉరి తీయాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలుగు యువత ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి, రెయ్యి జానికిరావు, కె.జయదేవ్, డి.డిల్లీరావు, జిలానీ, జగదీష్, రోటరీ, జేసీ క్లబ్ సభ్యులు, శాంతినికేతన్, సత్యసాయి పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

న్యాయం చేయాలి

అరసవల్లి: కోల్‌కతా హత్యాచార ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రగతిశీల మహిళాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కృష్ణవేణి, పి.కుసుమ అన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ భవనం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. అమానుషంగా ఉంటున్నాయన్నారు. వీటిని ప్రభుత్వం నిషేధించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు హేమక్క, జానకమ్మ, అప్పన్నమ్మ, ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, బాలకృష్ణ, జగన్, గోపి, మల్లిబాబు, మాధవరావు, అప్పయ్య, అప్పారావు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

పొందూరు: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దారుణమని గోరింట సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా సోమవారం సాయంత్రం గ్రామస్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి ఉరితీయాలని డిమాండ్ చేశారు. **గుజరాతీపేట:** వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు నిరసనగా సోమవారం శ్రీకాకుళం నగరంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, నాయకులు చల్లా వెంకటేశ్వరరావు, బైపల్లి రాజేశ్వరి, డా.సింధూర, శవ్వాన ఉమామహేశ్వరి, పి.సూర్యకుమారి, వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పొందూరు:కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గోరింట గ్రామస్థులు

వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

- కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తాం
- ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఈశ్వరరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, చిత్రంలో ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం, ఆగస్టు 19: గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, కేవలం వలంటీర్ల ద్వారా పాలన సాగించి సర్పంచ్‌లకు ప్రాధాన్యత లేకుండా చేసిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలు, సర్పంచ్‌లకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి మడ్డువలస జలాశయం ద్వారా ప్రతీ సెంటుకి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఒక్క పరిశ్రమ అయినా ఏర్పాటు చేస్తానని, దీనివల్ల మరికొన్ని పరిశ్రమలు వచ్చి ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. రైతులకు ఎరువులు కొరతలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి పనుల్లో లోపాలను జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ ప్రస్తావించగా.. గత ప్రభుత్వ హయాంలో మీరేమి చేశారని సభ్యులు నిలదీశారు. ఎమ్మెల్యే కలుగచేసుకొని గత ప్రభుత్వంలో జడ్పీటీసీ సభ్యునికి మాట్లాడే అవకాశం గానీ, పని చేసే అవకాశం గానీ ఇవ్వలేదన్నారు. ఆయన చెప్పే సమస్యలను వినాలని ఎమ్మెల్యే చెప్పడం విశేషం. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జలజీవన్ మిషన్ పనులు కూడా అధికారులు చేపట్టకపోవడం దారుణమని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏమి జరిగిందనేది పక్కన పెట్టి కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, టి.వెంకటరావు, మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, ఎంపీడీవో కె.వెంకన్నబాబు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో గుంతలు పూడ్చివేత


రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో ఆలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం పూడ్చివేశారు. ఆదివారం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన ఈ రహదారిపై ఉన్న గుంతలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న భారీ గోతుల్లో వైట్‌మిక్స్ వేసి రోలర్‌తో చదును చేయించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. అలాగే శివాలయం వద్ద పూర్తిగా కుంగిపోయిన కల్వర్టు వద్ద కొత్తది నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారు

పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల నిరసన

పొందూరు: విద్యారంగం, ఉపాధ్యాయ సమాజానికి తీవ్ర నష్టం కలిగించేలా ప్రభుత్వం పని సర్దుబాటు చేస్తుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఐక్య ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎంఆర్‌సీ కార్యాలయంలో జరిగిన పనిసర్దుబాటు కార్యక్రమాన్ని ఫ్యాప్టో, జాక్టో, ఫోర్టో సంఘాల నాయకులు బహిష్కరించారు. ఎంఈవోలు రామరాజు, రాజారావుకు వినతిపత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.రమణరావు, తేజేశ్వరరావు, జి.గోపాలరావు, కేవీవీఎం సత్యనారాయణ, జి.రామారావు, ఉపేంద్ర, ఎ.రవి, కె.విజయకుమార్, డి.శ్రీనివాసరావు, జి.మధుబాబు, జవహర్‌గుప్త, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో అధిక దిగుబడులు

ఆమదాలవలస: జీవామృతంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లేడ గ్రామాల్లో పంటలకు జీవామృతాన్ని రైతులతో వేయించారు. ఆయన మాట్లాడుతూ జీవామృతాన్ని రైతులతో తయారు చేయించి పంటలకు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మీ, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

వర్షానికి రోడ్డుపై విరిగిపడిన చెట్టు

- ప్రయాణికుల రాకపోకలకు ఇక్కట్లు


రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో సోమవారం కురిసిన వర్షానికి రోడ్డుపై పెద్ద చెట్టుకొమ్మ విరిగిపడింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. తక్షణం చెట్టు కొమ్మను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు

ఇచ్ఛాపురం: టౌన్‌లోకి హెవీ వెహికల్స్ రావటం కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం రైల్వే ఎల్‌సీ గేటు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పట్టణంలోకి వస్తున్న భారీ వాహనాలను అడ్డుకున్నారు. 12 వాహనాలకు రూ.11వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. హెవీ వెహికల్స్ ఉదయం 8లోపు, రాత్రి 8గంటల తరువాత మాత్రమే పట్టణంలోకి రావాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

22 కేసుల నమోదు

పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు వాహనాలన సోమవారం తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా కార్లు, బైకులు నడుపుతున్న వారితో పాటు హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులు 22 మందిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అంధకారంలో గోనెపాడు



సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు గ్రామంలో విద్యుత్ వీధి దీపాలు పది రోజులుగా వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. విద్యుత్ దీపాలు తమ పంచాయతీ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నప్పటికీ సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ బిర్లంగి అమ్మయమ్మ తెలిపారు. కనీసం వారంలో ఒక్క రోజుకూడా గ్రామంలోకి ఎనర్జీ అసిస్టెంట్ రావడం లేదని ఆరోపించారు. వర్షాల సీజన్ కావడంతో విషజంతువుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. దీనివల్ల గర్భిణులు, వృద్ధులు, పిల్లలు రాత్రి వేళ వీధుల్లోకి అడుగుపెట్టడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సర్పంచ్ కోరారు.

లీకులు అరికట్టాలి



ట్యాంకు నుంచి లీకవుతున్న తాగునీరు

బూర్జ: మండలంలోని లక్కుపురం రక్షిత మంచినీటి పథకం ట్యాం క్‌కు అమర్చిన కొళాయి ట్యాప్‌లు పాడవ్వడంతో తాగునీరు వృథాగా పోతుంది. లీకులను అరి కట్టాలని ఎన్నిమార్లు పంచాయతీ అధికారు లకు విన్నవించినా ఫలి తం లేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు. మరమ్మతులు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా లీకులను అరికట్టాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జి.సిగడాం: వసతి గృహ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. సంతవురిటి బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం రుచికరంగా భోజనం వండి పెట్టాలన్నారు. అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ రామచంద్రరావు, వసతిగృహ అధికారి గుంటుకు ప్రభాకరరావు ఉన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?

- అధ్వానంగా నారాయణపురం కాలువలు
- గుర్రపు డెక్కతో పొలాలకు అందని నీరు


గోకర్ణపల్లి వద్ద కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

పొందూరు: మూడు మండలాల పరిధిలో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే నారాయణపురం కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో తూములు, మదుముల ద్వారా పొలాలకు సాగునీరు అందడం లేదు. కాలువల నిర్వహణ కోసం ఇరిగేషన్‌శాఖ లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా వాటి పరిస్థితి మారడంలేదు. ముఖ్యంగా మండలంలోని గోకర్ణపల్లి, తుంగపేట తదితర గ్రామాల్లో కాలువల పరిస్థితి దారుణంగా ఉంది. దీంతో పొలా లకు నీరందక వరి చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు నష్టం తప్పదు

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం నారాయణపురం ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. కాలువల అభివృద్ధికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా పనులు మాత్రం కనిపించడం లేదు. వర్షాభావం, కాలువల్లో నీరు లేకపోవడంతో రైతులు ఖరీఫ్ నష్టపోయే ప్రమాదం ఉంది.

-ఎస్.శ్రీరంగనాయకులు, మాజీ ఎంపీటీసీ, గోకర్ణపల్లి

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచిలి: ఓపెన్ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు తెలిపారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో వెలుగు సీఎఫ్‌లు, సీసీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతిఒక్కరూ విద్యావంతులుగా మారాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓపెన్ తరగతులు నిర్వహిస్తుందన్నారు. 19 ఏళ్లు నిండిన వారు అర్హులని, ఎటువంటి విద్యా అనుభవం లేకున్నా ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇచ్ఛాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో కూడా నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కంచిలిలో చదువు ఆవశ్యకతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

కంచిలి: కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మిల మూడేళ్ల కుమారుడు రిషికేష్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బాలుడి కుటుంబ సభ్యులకు కంచిలి గ్రామానికి చెందిన విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. రిషికేష్ వైద్యానికి సుమారు రూ.25 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారని, దాతలు స్పందించాలని గ్రామస్థులు కోరారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

సోంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జింకిభద్ర పాఠశాల విద్యార్థులకు సోమవారం నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.వేణుగోపాల్, ఆరోగ్య సిబ్బంది శిరీష, కళావతి తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

సోంపేట: పట్టణంలోని పలు చెరువులు, సాగునీటి కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, వెంటనే వాటిని తొలగించాలని మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా సోంపేట మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వెంట దూసి మధు తదితరులు ఉన్నారు.

సంతోషిమాతకు పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీ సయ్యద్‌ఖాన్ చెరువు సమీపంలో కొలువైన సంతోషిమాతకు భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. మాటూరు సూర్యం దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ప్రాంగణలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో కమ్యూనికేషన్ డీఐజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని కమ్యూనికేషన్స్ డీఐజీ (మంగళగిరి) ఎస్ఎస్‌జే లక్ష్మి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నేతింటి హరిబాబు, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు. **జలుమూరు:** శ్రీముఖలింగేశ్వరస్వామిని డీఐజీ లక్ష్మి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటాచలం, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్ఎస్ఆర్-2025 సర్వే

కలెక్టరేట్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సమ్మరీ రివిజన్-2025 షెడ్యూల్ కోసం బుధవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు కోసం సెప్టెంబరు 30న షెడ్యూల్‌ను విడుదల చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పీఎంజె బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ), లాస సోమేశ్వరరావు(బీఎస్పీ), రట్టి ప్రకాష్(సీపీఎం) పాల్గొన్నారు.

వ్యాయామశాలకు రక్షణ కల్పించండి

కలెక్టరేట్: పెద్దపాడులో ఉన్న వ్యాయామశాలను రక్షించాలని గ్రామ యువకులు సోమవారం మీ కోసం కార్యక్రమంలో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం తనదంటూ కలగ దండు జగదీష్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు.

- పొందూరు, సంతకవిటి, ఎచ్చెర్ల మండలాల్లోని శివారు భూములకు సాగునీరు అందించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.